
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5, కనిష్ఠం 16.0

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
3
మంగళవారం 31 డిసెంబరు 2024

3వరకు జైనథ్ మార్కెట్‌లో సోయా కొనుగోళ్లు

జైనథ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ నాఫెడ్ ద్వారా సోయా కొనుగోళ్లు వచ్చే నెల జనవరి 3వ తేదీ వరకు ఉంటుందని జైనథ్ సొసైటీ సీఈవో జిగంగన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల సోయా రైతులు గమనించి తమ పంటను అమ్ముకోవాలని సీఈవో సూచించారు. అదేవిధంగా ఈ అవకాశాన్ని మండల సోయా రైతులు సద్వినియోగం చేసుకొని జైనథ్ పీఏసీఎస్, నాఫెడ్ సిబ్బంది సోయా రైతులు సహక రించాలని ఆయన పేర్కొన్నారు.

జంగుబాయి ఉత్సవాలను విజయవంతం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం రాయితాడ్ జంగుబాయి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ ప్రజాభవన్ వద్ద జంగుబాయి దేవస్థానం నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్కతో పాటు ఎమ్మెల్యే మాట్లాడుతూ పుష్యమాసాన్ని పురస్కరించుకొని ఆదివాసీలు ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో పవిత్రతో రాయితాడ్ జంగుబాయిను ప్రతీయేడాది దర్శించుకుంటారని తెలిపారు. జనవరి 2న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరండోలి గ్రామంలో జంగుబాయి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి దేవస్థానం చైర్మన్ శ్యాంరావు, గౌరవ అధ్యక్షుడు కొడప జాకు, సలహాదారుడు మరప బాజీరావు, సమన్వయకర్తలు తుమ్రం ప్రభ, వెట్టి భూమేష్, దొడంద మాజీ సర్పంచ్ తుమ్రం నాగు, రామారావు కటోడ, తుడందెబ్బ రాష్ట్ర నాయకుడు కొడప నగేష్, పుర్కబాపురావ్, మల్కుపటేల్, ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో ఏపుగా సాగవుతున్న పత్తి, జొన్న, కంది పంటలు







సాగు.. సంబురం

కాలచక్రం 2024 KALACHAKRAM

- జిల్లాలో ఈయేడు సమృద్ధిగా వర్షాలు.. నిండుకుండలా ప్రాజెక్టులు, చెరువులు
- వివిధ పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం
- రుణమాఫీ ఆనందం.. రైతు భరోసాకు ఎదురుచూపు
- బోనస్‌తో వరి పంటకు మరింత మద్దతుధర
- విత్తనాలు, మద్దతుధర కోసం పత్తి రైతుల ధర్నాలు
- కాలం కలిసి వచ్చినా.. ఆగని అన్నదాతల ఆత్మహత్యలు

ఆదిలాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో సాగు సంబురం కనిపిస్తోంది. జిల్లాలో అంతంత మాత్రంగానే నీటి వనరులు ఉండడంతో వర్షాధార పంటలైనా పత్తి, సోయా, కంది, శనగ, జొన్న, మొక్కజొన్న పంటలను రైతులు అధికంగా సాగు చేస్తారు. వానాకాలం సీజన్‌లో 5లక్షల 72వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్ కావడంతో లక్షా 50వేల ఎకరాలలో వివిధ రకాల పంటల సాగు ఊపందుకుంటోంది. ప్రధానంగా పత్తి పంట 4లక్షల 34వేల ఎకరాలలో సాగైంది. ఈ యేడు జిల్లా సాధారణ వర్షపాతం 1090.0 మి.మీ.లు కాగా, అధికంగా 1121.1 మి.మీ.ల వర్షపాతం కురిసింది. దీంతో ప్రధానంగా చెప్పుకునే సాత్నాల, మత్తడివాగు, చిక్‌మన్, కరత్వాడ, దేగామ ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపించాయి. దీంతో పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం కావడంతో దిగుబడులపై రైతులు భారీ అంచనాలు వేసుకుంటున్నారు. ఇప్పటికే సోయ పంట చేతికి వచ్చిన పత్తి పంటను ఏరే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా సాగయ్యే పత్తి పంటకు అనుకూలమైన వాతావరణం కావడంతో 30 లక్షల క్వింటాళ్లకు పైగా పంట దిగుబడు లు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 19 లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులను మార్కెట్‌లో విక్రయించారు. వాణిజ్య పంటగా పిలిచే పత్తి పంట పైననే రైతులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఈయేడు భారీ వర్షాలు కురవడంతో పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని పంటలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పంట నష్టపరిహారం కింద ఎకరాన రూ.10 వేలను అందించింది. జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయడంతో ఈయేడు కృషి విజ్ఞాన కేంద్రంలో తాత్కాలిక భవనాల్లోనే తరగతులను ప్రారంభించా రు. అలాగే కేంద్ర ప్రభుత్వం జిల్లాకు పత్తి పరిశోధన ఉప కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే వ్యవసాయ అనుబంధ పరిశ్రమల పురోగతి కనిపించలేదు. గత ఆరేళ్ల క్రితం ప్రారంభించిన కోర్టా-చనకా బ్యారేజ్ నిర్మాణం పనులు పూర్తికాక పోవడంతో అర ఎకరం ఆయకట్టుకైనా సాగునీరు అందడం లేదు. మొత్తానికి 2024 యేడాది అన్నదాతకు అనుకూలమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


విత్తనాల కోసం దుకాణాల ముందు బారులు తీరిన రైతులు (ఫైల్)


పెన్‌గంగా వరదలతో నీటమునిగిన పంట (ఫైల్)

రైతుభరోసా రాకపాయే..

గత ప్రభుత్వ హయాంలో పంటల సాగుకు పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు రైతుబంధు పథకాన్ని అమలు చేశారు. కానీ 2023 డిసెంబరులో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెట్టుబడి సహాయం కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెట్టుబడి సహాయం ఇప్పటికి అందక పోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. గతంలో రైతుబంధు కింద ఎకరానా రూ.5వేలు అందేవి. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని రూ.7500 పెంచుతూ రైతుభరోసాను ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ యేడాది గడుస్తున్నా.. నయాపైసా రావడం లేదని రైతులు చెబుతున్నారు. రూ.2లక్షల రుణమాఫీతో కొంత మంది రైతుల్లో ఆనందం కనిపిస్తున్న చాలా మందికి రుణమాఫీ దక్కలేదని నిరాశ కనిపిస్తోంది. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలంటూ రైతులు రాస్తారోకో, ధర్నాలు చేస్తూ డిమాండ్ చేస్తున్నారు. సంక్రాంతి పండుగ

(తరువాయి 6వ పేజీలో...)

కొత్త సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలి : ఎస్పీ

ఆదిలాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 2025 నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్త పడాలన్నారు. డిసెంబరు 31న జిల్లా వ్యాప్తంగా 30 ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి సంతోషకర వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. యువత మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా రాత్రివేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరుగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరంగా గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకలు రాత్రి 12.30గంటల వరకు పూర్తి చేసుకోవాలని ఆ తర్వాత చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. డిసెంబర్ 31న డీజేలు అధికంగా శబ్ధం చేసే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతులు లేవన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతు పట్టుబడితే వారికి ఇచ్చిన వారి పై కేసులు నమోదు చేస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రభుత్వ స్థలాలలో మద్యం సేవించరాదని సూచించారు. ఈ సంద


లైఫ్ జాకెట్‌ని చూపిస్తున్న అధికారి

పొచ్చెర జలపాతం వద్ద రక్షణ చర్యలు : రేంజ్ అధికారి

బోథ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే గజ ఈతగాలను నియమించడంతో పాటు సిబ్బందికి లైఫ్ జాకెట్లు అందుబాటు ఉన్నట్లు రేంజ్ అధికారి ప్రణయ్ మంగళవారం తెలిపారు. అయితే నూతనంగా వచ్చిన లైఫ్ జాకెట్లను తమ సిబ్బందికి గజ ఈతగాళ్లకు ఇవ్వనున్నారు. జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరుగుతూ ఉండడంతో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యాటకులు తమ సిబ్బందికి సహకరించి జలపాతం అందాలను వీక్షించాలని రేంజ్ అధికారి పేర్కొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● 'ప్రజావాణి'లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలను అందిస్తూ పరిష్కరించాలని విన్నవించారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులకు వాటిని అందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలను చూడాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఇబ్బందులు, సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా చర్యల గురించి ఫిర్యాదుదారుడి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● 'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ఐటీడీఏ సీఆర్టీ, కేజీబీవీ, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారించాలని లంబాడీల ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్, మండలాధ్యక్షులు రాథోడ్ సందీప్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం దిశగా సమ్మెలో పాల్గొన్నందున గిరిజన పాఠశాలలో విద్యార్థులు సరిగా చదవలేకపోతున్నారని పేర్కొన్నారు.


కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు

● 'కరెంట్ మోటర్లు సరఫరా చేయాలి'

తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంతో సహా జిల్లాలోని పలు గ్రామాల్లో దళిత బస్తీ రైతులకు కరెంట్ మోటర్లు వెంటనే సరఫరా చేయాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిదాస్ వినతి పత్రం అందజేశారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, సురేష్, అశోక్, కిషర్, స్వామి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలకు సత్వర పరిష్కారం

● గిరిజన దర్బార్'లో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను త్వరితగతిన చర్యలు చేపట్టి పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వారివారి సమస్యల విషయమై అర్జీలను ఆమె స్వీకరించారు. దీనిలో భాగంగా గాదిగూడ మండలం పెద్దాయి గ్రామానికి చెందిన లక్ష్మిబాయి తనకి త్రిఫేజ్, బోర్‌వెల్ మంజూరు చేయించాలని, నార్నూర్ గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ తనకి కార్‌లోన్ మంజూరు చేయించాలని, ఉట్నూర్ మండలం మారుతిగూడ గ్రామానికి చెందిన రుక్మబాయి బోరింగ్ రిపేర్ చేయించాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ప్రాజెక్టు అధికారి ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంతరావు, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, సీడీపీవో ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బుగుప్త

పూసాయిలో ప్రారంభమైన ఎల్లమ్మ మహా జాతర
● బోనమెత్తిన పూసాయి గ్రామ మహిళలు
7 లో
పంట దిగుబడులు రాక రైతుల దిగులు
● అప్పుల తీరక... ఎద్దుల అమ్మకాలు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఉద్యోగుల పట్ల సీఎం మొండి వైఖరి సరికాదు : ఎంపీ నగేష్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి మొండివైఖరి ప్రదర్శిస్తున్నారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరానికి ఆయన మద్దతు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు బీజేపీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

కాగా, సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెగ్యులరైజ్ చేయాలంటూ నినాదాలు చేశారు. స్థానిక కలెక్టరేట్ సమ్మె శిబిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌక్ వరకు సాగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉట్నూర్ ఏఎస్పీగా కాజల్ సింగ్



ఉట్నూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్‌గా ఐపీఎస్ అధికారి కాజల్ సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇక్కడ డీఎస్పీగా పని చేస్తున్న నాగేందర్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి

లోకేశ్వరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనలను పాటించాలని ఎస్సై అశోక్ కుమార్ అన్నారు. వాహనదారులు విధిగా సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. అలాగే డిసెంబరు 31 సెలబ్రేషన్స్, నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని అన్నారు. ఒకవేళ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినట్లయితే చర్యలు తప్పవన్నారు.

బెల్టు దుకాణాలపై అబ్కారీశాఖ దాడులు

ఇచ్చోడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోట్ల అబ్కారీశాఖ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు సీఐ జుల్ఫికర్ అహ్మద్ పేర్కొన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు రూ. 10వేల విలువగల మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు.

గులాబిరంగు పురుగు నివారణకు చర్యలు

నేరడిగొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తేజాపూర్ గ్రామంలో రైతులకు పత్తి పంటలో గులాబిరంగు పురుగు నివారణ గురించి వ్యవసాయ విస్తరణ అధికారి కె.శ్యామ్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నదన్నారు. కావున రైతు సోదరులు పత్తి పంట తీయడం పూర్తయితే పంట అవశేషాలను ట్రాక్టర్ రోటవేటర్, శ్రేడర్ సహాయంతో పంట పొలంలో కలియదున్నాలన్నారు. దీని ద్వారా పొలంలో సేంద్రీయ పదార్థం తయారై పత్తి తీయడం పూర్తయితే పంట పొలంలో గొర్రెలు మేకలు, పశువులను మేపాలన్నారు. పురుగు ఆశించిన గుడ్డిపూలు మొగ్గలు ఏరి నాశనం చేయాలి. వేసవి దుక్కులు చేయడం ద్వారా పురుగు కోశస్త దశలను సమర్థవంతంగా నివారించవచ్చునని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పంట కాలం పొడగించవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజారెడ్డి, గంగయ్య, నరసింహారెడ్డి, ప్రదీప్ వారు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సీఆర్టీలను మోసం చేస్తే సహించేది లేదు

● ఆదివాసీ సంక్షేమ పరిషత్

నార్నూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ఆదివాసీ సీఆర్టీలను మోసం చేస్తే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడిప్పుడు మా ఆదివాసీ 9తెగల ప్రజలు అభివృద్ధి పథంలో నడుస్తున్న సమయంలో కొంతమంది కుట్రదారులు కావాలని అటు ప్రభుత్వాన్ని ఇటు మా సమాజాన్ని అన్యాయం చేసేలా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి మద్దతుగా గిరిజనేతరులు లంబాడీ నాయకులు కొంత మంది మేధావులు గుమ్మగుడి మఖ్యపెట్టి ధర్నా చేపిస్తున్నారని ఇది ఎంత వరకు ఆరోపించారు. ధర్నాలకు కొంత మంది రాజకీయ నాయకులు మద్దతు పలికి అభం శుభం తెలియని ఆదివాసీ సీఆర్టీలను అన్యాయాన్ని గురి చేస్తున్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి నైతాన్‌బాలు ఆదేశాల మేరక ఈ అంశాల పైన ఉట్నూర్ ఐటీడీఏ పీఓకి కలిసి వాస్తవ పరిస్థితి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తాం పేర్కొన్నారు. ఆయన వెంట ఆదివాసీ నాయకులు దేవరావు,జంగు,వినోద్ తదితరులున్నారు.

బోథ్ సంతలో సెల్‌ఫోన్ చోరీ

● రూ. 89 వేలు మాయం

బోథ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన శుద్ధ స్వామి అనే యువకునికి చెందిన సెల్‌ఫోన్ గత మంగళవారం సంతలో చోరీ అయింది. అయితే చోరీ అయిన అనంతరం ఆయన సెల్‌ఫోన్ నుంచి లక్ష రూపాయలు డ్రా చేసినట్టు బాధితుడు తెలిపాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆలస్యంగా శనివారం వివరించారు. గత మంగళవారం బోథ్‌లోని సంతలో కూరగాయల కొనుగోలు చేయడం జరిగిందని, అయితే సంతలో గుర్తు తెలియని వ్యక్తి సెల్ ఫోను దొంగలించడం జరిగిందన్నారు. సెల్‌ఫోన్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. తాను ఫిర్యాదు చేసిన అనంతరం సిమ్ బ్లాక్ చేయించి మరో సిమ్ తీసుకోవడం జరిగింది అన్నారు. అయితే ఫిర్యాదు చేసి సిమ్ మార్చిన తర్వాత బుధవారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో తన సెల్‌ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా లక్ష రూపాయలు డ్రా చేయడం జరిగిందని బాధితుడు వివరించారు. అయితే ఫిర్యాదు చేయగానే రంగంలోకి దిగిన పోలీసులు సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేసిన వెంటనే రూ. లక్ష నుంచి రూ. 89 వేలు సంజయ్ చౌదరి పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనే వ్యక్తి మార్పిడి జరిగి 11000 రూపాయలు హోల్డ్‌లో ఉన్నా యని పోలీసులు తెలిపారు. అయితే హోల్డ్ అయిన డబ్బుల ఆధారంగా పోలీ సులు విచారణ చేపట్టారు. మార్పిడి జరిగిన డబ్బులు హిందూ సింధు బ్యాంక్ పశ్చిమబెంగాల్లోని సంజయ్ చౌదరి డ్రా చేయడం జరిగినట్టు ఆధారాలు సేకరించారు. అకౌంట్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మోటార్ సైకిల్ చోరీ

బోథ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పి. నారాయణ రెడ్డి అనే రిటైర్డ్ ఉపాధ్యాయునికి చెందిన మోటార్ సైకిల్‌ను ఆదివారం మధ్యాహ్నం దొంగలించారు. బస్టాండ్ ప్రాంతంలో పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకు వెళ్లారు. ఓ దుకాణం ముందు మోటార్ సైకిల్‌ను పెట్టి షాపులోకి వెళ్లి వచ్చేంత లోపు సైకిల్ మోటార్‌ను దుండగుడు ఎత్తుకు వెళ్లాడు. దుకాణం నుంచి తిరిగి వచ్చేలోపు వాహనం కనిపించకపోవడంతో వాహనం కోసం వెతికినా ఫలితం కనిపించలేదు. మోటార్ సైకిల్ దొంగతనం అయిన విషయాన్ని సోమవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా మూడు రోజుల క్రితం కౌటా(బి) గ్రామానికి చెందిన మల్లెపూల బాపయ్య అనే రైతుకు చెందిన రెండు ఎడ్లను పోతయ్య అనే వ్యక్తికి చెందిన దూడలను దుండగులు అపరించుకు వెళ్లారు. అయితే తెల్లవారు జామున అపహరించకపోయిన విషయాన్ని గమనించి గ్రామంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. అయితే గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులు ఎవరనే తెలియకుండా పోయింది. ఇక బోథ్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి పార్కింగ్ చేసి ఉంచిన కస్తూరి నవీన్ అనే వ్యక్తికి చెందిన కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. దీంతో సోమవారం ఉదయం సీసీ కెమెరాలు పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదని బాధితుడు వాపోయాడు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

● ఆదిలాబాద్‌లో ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వంద రోజుల్లోనే ఉచిత విద్య వైద్యం అందిస్తూ అభివృద్ధి చేస్తామని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను మరింత అభివృద్ధికి దూరం చేశాయని, బంగారు తెలంగాణ అని చెప్పినా బీఆర్ఎస్ పార్టీ మాజీ సీఎం కేసీఆర్ కూడా ప్రజలను నిండా దోచుకున్నారని ఆయన అన్నారు. జిల్లాకు వచ్చిన కేఏ పాల్‌కు స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై చర్చించారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రభుత్వాల వైఫల్యాలు, తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే చేపట్టనున్న అభివృద్ధి తదితర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తమ ముఖ్య ఉద్దేశమని, గ్రామాల్లో సర్పంచ్‌లుగా పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వంద రోజుల్లోనే అభివృద్ధి చేసి చూపుతామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నోటీసులు ఇవ్వకుండానే హైడ్రాతో వేల కోట్ల ఆస్తులను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు చేసిందేమి లేదని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజా శాంతి పార్టీ అభ్యర్థులు అన్ని ఓట్ల విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గెలిచన సంవత్సర కాలంలో అభివృద్ధి అంటే ఏంటో చూపుతామని, తమపై ప్రజలు నమ్మకం ఉంచాలని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా 34 ఏళ్ల కింద ఎలాగుందో ఇప్పుడు అలాగే వెనుకబడి ఉందన్నారు. అందుకే అభివృద్ధి చేయడానికి తాను వచ్చానని అన్నారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కరువు

● సీఆర్టీల నిరవధిక సమ్మెలో మాజీ మంత్రి జోగు రామన్న

ఉట్నూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న విమర్శించారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు సమస్యలు పరిష్కరించాలని కోరుతు సీఆర్టీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సోమవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి దశాబ్దాల క్రితం నుంచి సీఆర్టీలను నియమించి గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కాగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇచ్చి గద్దెఎక్కినందున న్యాయపరంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్న సీఆర్టీల సమస్యలను పెడచెవిన పెడుతున్నారన్నారు. తమ ప్రబుత్వం అధికారంలో ఉన్న రోజులలో కూడా గిరిజన సంక్షే మ అధికారుల నిర్లక్ష్యం వల్లనే సీఆర్టీలకు న్యాయం జరగలేదని అన్నారు. సీఆర్టీల సమస్యలు పరిష్కరించే వరకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ రాథోడ్‌జనార్ధన్, మాజీ ఎంపీపీ పంద్రాజైవంత్‌రావు, బీఆర్ఎస్ వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, కాటం రమేష్, కేంద్రీ రమేష్, విజ్జగిరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాగా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లు సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. ఉమ్మడి జిల్లాలోని 1200 మంది సీఆర్టీలు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శి వంశీ ఆరోపించారు. న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.



సమ్మెకు మద్దతు పలుకుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

పోలీసులు స్టేషన్‌కు పిలిపించారనే మనస్థాపంతో.. ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

● గ్రామస్థులు కేసు చేయించడంతోనే ఉరేసుకున్నట్లు కుటుంబీకుల ఆరోపణ ● రహదారిపై బైఠాయింపు

● డీఎస్పీ నాగేందర్ రాకతో సద్దుమణిగిన వివాదం

నేరడిగొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసులు స్టేషన్‌కు పిలిపించారనే మనస్థాపంతో.. ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నేరడిగొండ మండలం బుద్దికొండ గ్రామానికి చెందిన సింగం సాయిచరణ్ (23) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 25వ తేదీన తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలను గ్రామ శివారులో గల పోచమ్మ ఆలయం వద్ద జరుపుకున్నారు. మద్యం తాగిన మత్తులో అక్కడే ఉన్న హైమాస్ట్ లైట్‌లను సాయిచరణ్‌తో పాటు అతని స్నేహితులు పగలగొట్టారు. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జరిగిన ఘటనపై ఎస్సైకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై శ్రీకాంత్ రెండు రోజుల క్రితం సదరు యువకులను పిలిపించి లైట్లు ఎందుకు పగలగొట్టారని విచారించారు. పగలగొట్టిన లైట్‌లను ఏర్పాటు చేయిస్తామని యువకులు ఒప్పుకోవడంతో.. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని ఎస్సై వారిని హెచ్చరించాడు. పోలీసులు స్టేషన్‌కు పిలిపించడంతో సాయిచరణ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. అదే సమయంలో మున్ముందు కూడా మళ్లీ స్టేషన్‌కు పిలిపిస్తారేమోనన్న భయంతో గత ఆదివారం అర్ధరాత్రి పనిమీద బయటకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత సోమవారం తెల్లవారుజామున బుద్దికొండ గ్రామ శివారులో గల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తన కొడుకు మృతికి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారణమని ఆరోపిస్తూ సాయిచరణ్ కుటుంబీకులు సోమవారం గ్రామంలో ఆందోళన చేశారు. తన కొడుకును పోలీసు స్టేషన్‌కు పిలిపించకుంటే చనిపోయే వాడు కాదని, పోలీసు స్టేషన్‌కు పిలిపించడం వల్లే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తన కొడుకు మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేష్‌లు ఘటనా స్థలికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ఫిర్యాదు చేసిన వ్యక్తులను అరెస్టు చేశామని చెప్పడంతో.. వారు ఆందోళన విరమించారు. మరోవైపు ఈ విషయమై గ్రామస్థులు కూడా ఆందోళన చేశారు. గ్రామం ఆస్తిని ధ్వంసం చేస్తే ఫిర్యాదు చేయడం తప్పా!? అని డీఎస్పీని ప్రశ్నించారు. దీంతో డీఎస్పీ వారికి సర్దిచెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిండు పార్లమెంట్‌లో బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం, సీపీఐ, సీపీఎంఎల్ మాస్‌లైన్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో నిరసన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, మాస్‌లైన్ జిల్లా నాయకులు జగన్ సింగ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంకట్ నారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అంగీకరించని ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగమే అమిత్ షా వ్యాఖ్యలు అని మండిపడ్డారు. భారత రాజ్యాంగం స్థానంలో మను ధర్మాన్ని తీసుకురవాలన్న ప్రయత్నంలో భాగంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనేక సార్లు రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను వీరు అవహేళన చేశారన్నారు. బ్రాహ్మణవాద అగ్రవర్ణ ఆధిపత్య భవజాలాన్ని దేశంపై రుద్దడానికి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, ఎం.గంగన్న, లంక జమున, ఎన్. స్వామి, సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ స్వామి, చిల్క దేవిదాస్, చంద్రమౌళి, మెస్రం భాస్కర్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు సురేష్, సాయి, సీపీఎం న్యూడెమోక్రసీ నాయకులు గణేష్ పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణానికి పోటెత్తిన భక్తజనం

బోథ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఆదివారం వరద రాత్రి మల్లన్న కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు మండలంలోని కౌటా(బి), కనుగుట్ట గ్రామాల నుంచి కాక నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. కన్నుల పండువగ నిర్వహించిన కల్యాణ వేడుకల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లన్న ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈసారి గతంలో కంటే అధిక మొత్తంలో భక్తులు తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామస్తులు సహకరించారని వివరించారు.



కౌటా(బి)లో మల్లన్న కల్యాణానికి హాజరైన భక్తులు

పంట పొలాల్లో ఘనంగా ఎలమాస పండుగ



పొలాల్లో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించిన రైతులు

ఇంద్రవెల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మార్గశిర మాసం బహుళ అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ఎలామావాస్యగా ఎలమాస పండుగను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా రైతు కుటుంబాలు పోలెలు, రకరకాల కూరగాయలు, పప్పులతో ప్రత్యేక వంటకాలను చేశారు. ఉదయాన్నే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పొలాల్లోకి వెళ్లారు. పొలాల్లో శ్రీ మహాలక్ష్మి దేవి కటాక్షం కోసం మండపం వేసి భూదేవి అమ్మవారికి పాలు పొంగించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం రైతులు, మహిళలు ఒకరి పొలాల్లో మరొకరు వెళ్లి మహాలక్ష్మి ప్రసాదంగా సహపంక్తి భోజనాలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది ఎలమాస పండుగను నిర్వహిస్తామని రైతులు తెలిపారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నేరడిగొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ సీఆర్టీ, కేజీబీవీ,సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లంబాడీల ఐక్యవేదిక(లైవ్) జిల్లా అధ్యక్షుడు మహేందర్‌జాదవ్, మండల అధ్యక్షుడు రాథోడ్‌సందీప్‌కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం దిశగా సమ్మెలో పాల్గొన్నందున గిరిజన పాఠశాలలో విద్యార్థులు సరిగా చదవలేక పోతున్నారని పేర్కొన్నారు.



ఆదిలాబాద్ మార్కెట్‌కు భారీగా వచ్చిన పత్తి బండ్లు

ఆదిలాబాద్‌లో సాగు సంబురం

(5వ పేజీ తరువాయి...)

నుంచి రైతు భరోసాను అందిస్తామని ప్రభుత్వం చెబుతున్న ఎప్పుడు వస్తుందో? అర్థంకాని పరిస్థితి ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

వరి పంటకు బోనస్

మునుపెన్నడు లేనివిధంగా ఈయేడు ప్రభుత్వం వరి పంటకు బోనస్‌ను ఇస్తుంది. సన్నరకం వరి పంటను ప్రోత్సహిస్తూ.. క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను అందిస్తుంది. దీంతో రైతుకు మద్దతుధర దక్కుతుంది. సన్నరకం వరి పంటకు రూ.2300 మద్దతుధర ఉండగా అదనంగా మరో రూ.500లను బోనస్‌గా ఇవ్వడంతో క్వింటాల్ వరి ధాన్యానికి రూ.2800 ధర దక్కుతుంది. కానీ కొనుగోలు కేంద్రాలలో కోతలు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అర్తి, హమాలీ, తరుగు పేరిట కోతలు విధించడంతో నష్టపోతున్నారు. క్వింటాల్‌కు 3, 4కిలోల చొప్పున కోతలు పెడుతున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ రకమైన బోనస్‌ను ఇవ్వడంతో సన్నరకం వరి సాగు గణనీయంగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. బోనస్ మంచిదే అయినా.. కొనుగోలు కేంద్రాలలో కోతలు విధించకుండా ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు.

విత్తనం కోసం తప్పని తిప్పలు

ఈయేడు ప్రారంభంలోనే పత్తి విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పలేదు. మే, జూన్ నెలల్లో పత్తి విత్తనాల కొరత ఏర్పడడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాశి 659 పత్తి రకం విత్తనాల కోసం రైతులు కిలోమీటర్ల మేర బారులు తీరి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబమంతా వచ్చి విత్తనాల కోసం దుకాణాల ముందుబారులు తీరిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లాకేంద్రంలో రైతులపై స్వల్ప లాఠీచార్జీ జరుగడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రత్యేక అధికారులను నియమించి పకడ్బందీగా పత్తి విత్తనాలను సరఫరా చేశారు. ప్రారంభంలోనే పత్తి రైతులకు విత్తనాల గోస తప్పలేదు. అలాగే పత్తి కొనుగోళ్ల ప్రారంభంకాగానే తేమ శాతం పేరిటా కోతలు విధించడంతో ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. ప్రతియేటా విత్తనం, పంట కొనుగోళ్ల కోసం రైతులు ఆందోళనలు చేపట్టడం జిల్లాలో పరిపాటిగానే మారింది. అడుగడుగునా అన్నదాతలను వ్యాపారులు నిండా ముంచుతూనే ఉన్నారు.

ఆగని ఆత్మహత్యలు

కాలం కలిసి వచ్చినా.. జిల్లాలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. పంట చేతికి వచ్చిన సమయంలోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఎన్నో ఆశలతో పంటలను సాగు చేస్తున్నా.. దిగుబడులు రాకపోవడంతో అన్నదాతలు బెంగ పెట్టుకుని ఉసురు తీసుకుంటున్నారు. ఈయేడు జనవరి నుంచి డిసెంబరు వరకు జిల్లావ్యాప్తంగా 32 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా.. ఇందులో సగానికిపైగా రైతులు కౌలు రైతులేనని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. భూపట్టా కలిగి ఉన్న రైతులకు ప్రభుత్వం రైతుబీమా కింద రూ.5లక్షల పరిహారాన్ని అందిస్తున్నా.. కౌలు రైతు కుటుంబాల పరిస్థితి దీనంగా మారింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలను అమలు చేస్తోంది. అయినా అవి ఏమూలన సరిపోవడం లేదని రైతులు చెబుతున్నారు. రుణమాఫీతో పాటు రైతుబంధు పథకాలు సక్రమంగా అమలుకాక పోవడమే ఇలాంటి పరిస్థితికి కారణమంటున్నారు. వరి పంట మాదిరిగానే పత్తికి బోనస్ ఇవ్వాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. రైతుల ఆత్మహత్యలను అరికట్టడంలో ప్రభుత్వం నామమాత్రంగానే చర్యలు తీసుకుంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి

సీఎం నాయకత్వంలోనే అభివృద్ధి : కంది

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలివారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమత్రి రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి సీతక్కను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆహ్వానం మేరకు హుటాహుటిన కంది శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే ఆదిలాబాద్ అభివృద్ధి సాధ్యమన్నారు. ఆదిలాబాద్‌లో పార్టీ ప్రగతికి పునరాంకితం కావడం పట్ల ప్రశంసించారన్నారు.

సోలార్ విద్యుత్ షాక్ తగిలి ఒకరి మృతి

పెంబి/(ఖానాపూర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి, తెలిపిన వివరాల ప్రకారం.. మస్కాపూర్ గ్రామానికి చెందిన ఓడ్నాల చిన్నోళ్ల పెద్ద భీమన్న(64) అదే గ్రామానికి ఆనుకొని ఉన్న గంగాయిపేట్ గ్రామ శివారులో తనకున్న 1 ఎకరం 30 గుంటల భూమిలో కూరగాయలు పండిస్తున్నాడని, అడవి పందుల రక్షణ కొరకు సోలా కనెక్షన్ ఏర్పాటు చేయగా, ప్రమాదవశాత్తు వైర్లు తగిలి షాక్‌తో అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, భార్య లక్ష్మీ ఉన్నట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త తప్పి పోయాడని ఫిర్యాదు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): దుబాయ్ వెళ్తానని చెప్పి ముంబాయిలో తప్పిపోయిన భర్త నాలుగు నెలలైనా ఆచూకీ తెలియకపోవడంపై భార్య సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు పి. స్వదేశ్‌ను నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి, భార్య లక్ష్మీ అధికారులను వేరువేరుగా కలిసి ఫిర్యాదు చేసింది. బొడ్డు సాయి అనే సబ్ ఏజెంట్ 75 వేల రూపాయలు తీసుకొని ముంబాయి సామ్ ఏజెన్సీ ట్రావెల్ సహాయంతో ఆగస్టు 5న ఫ్లైట్ బుక్ చేశాడని తెలిపింది. ఆర్మూర్ నుండి ఆగస్టు 3న ముంబాయి బయలుదేరి 4న అక్కడ దిగిన సమాచారం తనకు చెప్పాడని పేర్కొంది. అప్పటి నుండి కుటుంబానికి ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. ఏజెంట్‌కు ఫోన్ చేయగా ఫ్లైట్ ఎక్కలేదని సమాచారం ఇచ్చాడని తెలిపింది. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని తమ భర్త ఆచూకీ కోసం వినతి చేసింది.

అదుపుతప్పి పత్తి డీసీఎం బోల్తా

పెంబి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుల గ్రామ సమీపంలోని కడెం వాగులో సోమవారం పత్తి డీసీఎం అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. పలువురు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పసుపుల గ్రామంలో పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి పత్తి లోడ్ చేసి తరలిస్తున్న సమయంలో గ్రామ సమీపంలోని కడెం వాగును దాడుతున్న సమయంలో బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. డ్రైవర్ రాజేందర్ బాగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పసుపుల వంతెన బాగుంటే ఇదంతా జరిగేది కాదని గ్రామస్తులు తెలిపారు. వెంటనే కడెం వాగుపై వంతెన నిర్మించాలని తెలిపారు.

దిగుబడి లేక దిగులు

● రుణమాఫీ కాక ఇబ్బందులు ● పండిన పంట దళారుల పాలు ● ఎడ్లు అమ్ముకుంటున్న రైతులు



సుంకిడిలో సంతకు అమ్మకానికి వచ్చిన ఎడ్ల జతలు

తలమడుగు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతుల కన్నీటి కష్టాలు తీరడం లేదు. కొండంత ఆశతో యాసంగి పనులను ప్రారంభించినప్పటికీ ప్రకృతి వైపరీత్యా అతి వృష్టి, అనావృష్టితో పంటల పండక రైతు లు ప్రతి సంవత్సరం అప్పుల పాలు అవుతున్నారు. ఈ సంవత్సరం యాసంగి పనులను ప్రారంభించినప్పటికీ మధ్యలోనే వర్షాలు కురువకపోవడంతో ఈ సంవత్సరం పంటలు దిగుబడి రాక పంటల కోసం చేసిన అప్పులు తీరక కుటుంబ పోషణ భారమై అప్పులు చెల్లించేందుకు ఎంతో ఇష్టపడి పెంచు కున్న దుక్కి టి ఎద్దులను రైతులు అమ్ముకోవాల్సిన పరి స్థితులు ఏర్పడుతున్నాయి.. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సంకిడి గ్రామంలో ఆదివారం ఎద్దుల అంగడికి రైతులు ఎడ్లను విక్రయించేందుకు వచ్చారు.



ఎడ్ల బండితో వస్తున్న రైతులు

ఒక్కో రైతు ఒక్కో గాధా వినిపిస్తూ తన బాధను చెప్పుకున్నారు ఎద్దుల అంగడిలో కొనేవారి కంటే అమ్మేవారే ఎక్కువగా ఉన్నారు. ఎద్దులను కొనుగోలు చేసే దళారులు వారికి ఇష్టం వచ్చి న రేట్లను చెల్లించి కొనుగోలు చేశారు. 50 వేలు పలికే ఎడ్ల జోడి 20 వేల రూపాయలకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సంవత్సరం వర్షాలు మధ్య లోనే ఆగిపోవడంతో పదెకరాల పంట భూమిలో కనీసం 10 కుంటల పత్తి కూడా పండలేదని రైతులు తెలిపారు. పది ఎకరాల వ్యవసాయ మీ భూమి పంట కోసం దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేస్తే లక్ష రూపాయల పంట కూడా పండలేదు. వ్యవ సాయ కోసం చేసిన అప్పులు, కుటుంబపు పోషణ కోసం చేసిన అప్పులు అధికం కావడంతో రైతన్నలు దిక్కు తోచగా తనకు ఆధారంగా ఉన్న ఎద్దుల జాతుల ను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ. చేస్తామని చెప్పినప్పటికీ రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకు ల్లోనూ రుణాలు దొరక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యవసాయం కోసం అధిక వడ్డీతో వడ్డీ వ్యాపారాల నుంచి పెట్టుబడి సాయం కోసం అప్పులు చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ రుణ మాఫీ వర్తింపచేయాలని కోరుతున్నారు. అంతేకాకుండా వ్యవసాయం సాగుచేసే రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో లింకు చేపడితే రైతులకు మరింత తోడ్పాటు ఉంటుందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పంటలు దిగుబడి రాక, ఎడ్లను విక్రయించుకుంటున్నాం

● రమేష్, రైతు, కప్పర్ల

ఈ సంవత్సరం వ్యవసాయంలో పత్తి పం టను సాగు చేయగా పది ఎకరాల్లో అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రాలేదు. పంట కోసం చేసిన అప్పులు అధికం కావడంతో అప్పుడు చెల్లించేందుకు ఎడ్లను విక్రయించేందుకు సుంకిడి అంగడికి వచ్చాను. గతంలో 80 వేలకు కొన్న ఎడ్లు ఇప్పుడు 40 వేలకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



ఇంకా రుణమాఫీ కాలేదు

● శంకర్ రైతు కప్పర్ల

తాంసి మండలం కప్పర్ల గ్రామంలో మూడు లక్షల బ్యాంకు రుణం ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి రుణమాఫీ కాలేదు. ఇటు పంటలు కూడా సక్రమంగా పండలేదు. అందుకే ఉన్న ఎడ్లను విక్రయించేందుకు సుంకిడి మార్కెట్‌కు వచ్చాను. 70 వేల ఎడ్ల జతను 30 వేలకు దళారులు అడుగుతున్నారు.



వ్యవసాయం చాలా కష్టంగా మారింది

● లక్ష్మణ్ ఠాకూర్, కొత్తూర్

వ్యవసాయం చేయాలంటేనే కష్టంగా మారింది. ఎంత కష్టపడ్డా ఫలితం లభించడం లేదు. చేసిన కష్టమంతా దళారులపాలే అవుతుంది. ఉన్న భూమిని కౌలుకు ఇచ్చి కూలి పని చేసు కుని జీవిస్తున్నాం. ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు.

ఇటిక్యాల్ వాటర్ ప్లాంట్ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలి

● కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇటిక్యాల్ గ్రామస్తులు

పెంబి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో నిర్మించే వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేసి, ప్రభుత్వ దాని అనుమతులు రద్దుచేయాలని సోమవారం ఇటిక్యాల్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... ఇటిక్యాల్ గ్రామస్తుల నుంచి ఎలాంటి అభిప్రాయాలు స్వీకరించకుండా, గ్రామం నుంచి ఎలాంటి తీర్మానాలు తీసుకోకుండా అక్రమంగా వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపడుతున్నారని, అక్రమంగా అనుమతులను పొంది చేపట్టే వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఈ వాటర్ ప్లాంట్ వల్ల భవిష్యత్తులో గ్రామానికి ముప్పు వాటిల్లుతుందని భయాందోళనకు గురవుతున్నామని, గతంలో మండల అధికారులకు సైతం ఫిర్యాదులు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి అక్రమ అనుమతులతో చేపడుతున్న వాటర్ ప్లాంట్ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, లేని పక్షంలో జిల్లా స్థాయిలో ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఇందులో గ్రామ మాజీ సర్పంచ్ మద్దెల మహేందర్, గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి మీర్జా సమిబేగ్, కోశాధికారి గణేష్ పటేల్, ఉపాధ్యక్షులు సుంచు ఎల్లయ్య, కార్యదర్శులు బాణావత్ వినాయక్, షబ్బీర్, అయిండ్ల రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ మహాజాతర ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జైనథ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జైనథ్ మండలంలోని పూసాయి గ్రామంలో సోమవారం పుష్యమాసం నుంచి మహాజాతర ప్రారంభం అయింది. ఈ జాతర పుష్యమాసం నుంచి మాగమాసం వరకు నెలరోజుల పాటు కొనసాగనుంది. మహా జాతరలో భాగంగా సోమవారం పూసాయి గ్రామమహిళలు ప్రత్యేక నైవేద్యాన్ని వండి ప్రతి ఇంటి నుంచి బోనం కుండలను తలపై పెట్టుకుని డప్పులభజాల మధ్య పూసాయి ఎల్లమ్మ ఆలయం వరకు భారీ శోభా యాత్ర నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్న మహిళలు బోనం కుండలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం పూసాయి ఎల్లమ్మ దుర్గామాతకు బోనాన్ని సమర్పించి ప్రత్యేక మొక్కులను తీర్చు కున్నారు. ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని దుర్గామాత, ఎల్లమ్మ, అదే విధంగా కొనేరు పూజలు నిర్వహించి వేడుకున్నారు. కార్యక్రమంలో పూసాయి గ్రామపెద్దలు నిర్వాహకులు మాజీ సర్పంచ్ ఎడమల పోతా రెడ్డి,గ్రామపెద్దలు దోషెట్టి గంగాధర్, బుర్రిచిన్నయ్య, బుద్దెరాజన్న, కుర్మదేవన్న, శాలిక్‌రావ్, బుర్రికిరణ్, బుర్రి సంతోష్, నవీన్‌లతో పాటు పూసాయి గ్రామ మహిళలు, భక్తులు, ప్రజలు పాల్గొ న్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న పూసాయి ఎల్లమ్మ ఆలయం

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



అభినందనలు తెలియజేస్తున్న జిల్లా కలెక్టర్



జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి 500ల మంది విద్యార్థులు సీఎం కప్ రాష్ట్ర క్రీడల్లో పాల్గొనడం గర్వకారమని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరుతున్న క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రత్యేకంగా హన్మకొండ, హైదరాబాద్, వరంగల్, ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరే క్రీడాకారుల కోసం మూడు బస్సులను ఏర్పాటు చేయగా క్యాంపు కార్యాలయం నుంచి వాటిని ప్రారంభించారు. క్రీడాకారులతో మాట్లాడి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్ క్రీడాపోటీల్లో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో వివిధ ఆటల్లో పాల్గొనేందుకు బయలుదేరారన్నారు. సోమవారం 150 మంది క్రీడాకారులు వెళ్లగా కొన్ని రోజుల క్రితం 250 మంది బయలుదేరారని కలెక్టర్ తెలిపారు. దశల వారీగా ఆయా క్రీడా అంశాల్లో జిల్లా నుంచి 500ల మంది పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. నిత్యం సాధన చేస్తూ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రావడం అభినందనీయమన్నారు. అదేస్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి జిల్లాకు పథకాలను తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారధి, రాజేశ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు

భైంసా, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుకొని 8 పతకాలను సాధించారు. ఈ నెలల 27 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం తరపున జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో క్రీడాప్రతిభను చాటుకొని ముగ్గురు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించగా మరో ముగ్గురు రజతం, ఇంకో ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ నగదు పురస్కారాన్ని అందించి సత్కరించింది. బంగారు పతకం సాధించిన క్రీడాకారులకు రూ.20,000, రజత పతకం సాధించిన వారికి రూ.15,000, కాంస్య పతకం సాధించిన వారికి రూ.10,000 చొప్పన నగదు బహుమతి నజరానాగా అందించారు. బంగారు పతకం సాధించిన వారిలో అబ్దుల్ రహమాన్ (సబ్ జూనియర్స్ బాలురు, 24 కిలోల విభాగం), రాథోడ్ కృష్ణ (సబ్ జూనియర్స్ బాలుర, 36 కిలోల విభాగం), ఎల్.మమత (సబ్ జూనియర్స్ బాలికలు, 36 కిలోల విభాగం), రజత పతకం సాధించిన వారిలో డి.రాజేశ్వరి, (సబ్ జూనియర్స్ ,బాలికలు ,33 కిలోల విభాగం), కె.పల్లవి (జూనియర్ గర్ల్స్ , బాలికలు, 48 కిలోల విభాగం), ఎస్.రుద్ర (సబ్ జూనియర్స్, బాలుర, 21 కిలోల విభాగం), కాంస్య పతకం సాధించిన వారిలో శ్రేయస్ కార్తికేయ (సబ్ జూనియర్స్, బాలుర, 30 కిలోల విభాగం), ఆర్.కళ్యాణి భాయ్, (జూనియర్ బాలికలు, 52 కిలోల విభాగం) ఉన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటిన క్రీడాకారులకు, ఖేలో ఇండియా వుషూ కోచ్ జ్ఞాన తేజను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజన్ ఆహ్మద్, జిల్లా యవజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలు బహుకరించినట్లుగా వుషూ అర్స్ మార్శల్ ఆర్ట్స్ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు.

ఇష్టారాజ్యంగా మొరం తరలింపు!



అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు

లక్ష్మణచాంద, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జేసీబీ, రెండు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. స్థానికులు, అధికారుల సమాచారం ప్రకారం ... ఆదివారం రాత్రి స్థానిక చెరువులో అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో రెవెన్యూ అధికారులు మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీనీ పట్టుకుని స్టేషన్‌కు తరలించాలని పోలీసులు సమాచారం ఇచ్చారు. ఆ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని ప్రయత్నించగా పదిహేను మంది వరకు అడ్డగించినట్లు తెలిసింది. మేము వాహనాలు పోలీస్ స్టేషన్‌కు తీసుకురామని తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక ఆ వాహనాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉంచి నట్లు తెలుస్తోంది. మరోవైపు రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య సమన్వయ లోపం అక్రమ రవాణాదారులకు వరంగా మారిందని పలువురు వ్యాఖ్యానించారు. అనంతరం ఆ వాహనాలకు జరిమానా విధించి మరోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని చెప్పినట్లు తెలిసింది.

ఎల్టా ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్ష

నిర్మల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ లోని జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఒలంపియాడ్ పరీక్షను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో పరీక్షల విజేతలు ఈ నెల 3న జిల్లా స్థాయి పరీక్షలో పాల్గొన నున్నారు. కాగా ఎల్టా ఒలంపియాడ్ పరీక్ష పత్రాన్ని ప్రారంభంలో పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ దత్తురాంతో పాటు ఇంగ్లీష్ టీచర్లు ఇర్ఫాన్ షేక్, రమణతో పాటు టీచర్లు దయానంద్, శ్రీనివాస రెడ్డి, మల్లేశం, వసంత్ రావు, రాజన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ఎల్టా జిల్లా అధ్యక్షుడు కడార్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బాధ్యులు రతన్, ఆధ్వర్యంలో ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆటల్లేవ్!

వృథాగా క్రీడా ప్రాంగణాలు



సిరిచెల్మలో అలంకారప్రాయంగా ఉన్న క్రీడాప్రాంగణం

ఇచ్చోడ, డిసెంబరు, 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు పెంపొందించేందుకు ప్రతి పంచాయతీకి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. సరైన స్థల సేకరణ చేయకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆటలా డేందుకు ఇబ్బందులకు గురవుతుంది. ఇచ్చోడ మండలంలోని జున్ని, సిరిచెల్మ గ్రామాలలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలు పేరుకు మాత్రమే పరిమితమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో స్థలం లేకపోవడంతో ఇబ్బందులు, మరికొన్ని ప్రాంతాల్లో ఊరి చివరణ క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటుచేయడంతో క్రీడలకు గ్రామాల్లో చోటులేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో వసతులు ఏర్పాటుచేసి క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జున్నిలో క్రీడాప్రాంగణం

సమ్మె నోటీసు అందజేసిన హమాలీలు

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జనవరి 1 నుంచి సమ్మె చేస్తామని సివిల్ సప్లై హమాలీలు అధికారి సురేష్‌కు సోమవారం నోటీసు అందజేశారు. పెరిగిన హమాలీ రేట్లకు జీవో విడుదల చేయాలని లేకుంటే విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నాయకుడు ఎస్. విలాస్, హమాలీ సంఘ నాయకుడు రాథోడ్ పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.


బాసరలో సీఐ, ఎస్సైలకు ఆదేశాలు ఇస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

అసాంఘిక కార్యకలాపాలపై..
ఉక్కుపాదం!

- బాసరలో లాడ్జీలపై పోలీసుల వరుస దాడులు
- ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు
- బాసర క్షేత్ర విశిష్టతను దెబ్బతిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

బాసర, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : బాసర పుణ్యక్షేత్రంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పుణ్యక్షేత్రంలోని కొన్ని ప్రైవేటు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంతో పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. గత నెల రోజుల్లో దాడులు చేసి నాలుగు కేసులు నమోదు చేయగా తాజాగా మరో రెండు పోక్సో కేసులు పెట్టారు. మైనర్లకు గదులను అద్దెకిస్తూ కొందరు సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందిని తగినంత నియమించి పర్యవేక్షిస్తున్నారు. తరచుగా దాడులతో అసాంఘిక కార్యకలాపాలతో పాటు పేకాట, జూదం వంటివి కొనసాగకుండా ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు.

బాసర క్షేత్ర విశిష్టతను దెబ్బతీయొద్దు

● అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుల సూచనలు వ్యాపారులు, లాడ్జి యజమానులు పాటించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఐడీ ప్రూఫ్ లేకుండా గదులను అద్దెకిస్తే చర్యలుంటాయి. బాసర పుణ్య క్షేత్ర విశిష్టతను దెబ్బతీస్తే సహించేది లేదు.

కఠిన ఆదేశాలు

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ సంయుక్తంగా బాసరపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో శాంతి భద్రతల పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పుణ్యక్షేత్రంలో గల ప్రతీ వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. గదులు అద్దెకిచ్చే ముందు వారిని పూర్తిగా పరిశీలించిన తర్వాతనే గదులు కేటాయించాలని సూచిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించేలా స్థానికులకు అవగాహన కల్పించారు. చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేకుండా గదులను ఇవ్వరాదని, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. తరచుగా స్థానిక లాడ్జీలు, సత్రాల యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

నెల రోజుల్లో నాలుగు కేసులు నమోదు

ముందస్తు సూచనలు పాటించని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. నెల రోజుల్లో నాలుగు కేసులు నమోదయ్యాయి. పోలీసు సూచనలను తప్పకుండా పాటించాల్సిందేనని స్పష్టం చేస్తు న్నారు. లాడ్జి యజమానులతో పాటు నిర్వాహకులు, లీజు యజమానులపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలు ప్రస్తుతం బాసర క్షేత్రంలో సత్ఫలితాలిస్తున్నాయి.

తాజాగా రెండు పోక్సో కేసులు

బాలికలకు అద్దె గదులను కేటాయించినందుకు రెండు లాడ్జి యజమానులపై పోక్సో కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి బాలికను చెందిన వ్యక్తులకు అద్దె గదిని కేటాయించడంతో మొహినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. మొహినాబాద్ పోలీసులు వచ్చి లాడ్జి యజమానిని అదుపులోకి తీసుకొని వెళ్లారు. తాజాగా రెండు రోజుల కిందట మరో ఇలాంటి తరహాలోనే బాలికకు గది కేటాయించడం వల్ల ఒక కాటేజీ నిర్వాహకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. రెండు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయడం ప్రస్తుతం బాసరలో చర్చనీయాంశంగా మారింది.


లాడ్జిలో తనిఖీ చేస్తున్న పోలీసులు


బాసర పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏఎస్పీ

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడగ గదుల ఇళ్లు, రైతు రుణమాఫీ వంటి సమస్య లను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనం తరం ఆయన మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళా ద్వారా పలువురికి ఉపాధి

నిర్మల్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం సీతారాం స్పిన్నర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ఉద్యోగ మేళా ద్వారా పలువురు నిరుద్యోగులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు దాదాపు 100 మంది హాజరు కాగా, 60 మంది ఉద్యోగులకు దర ఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. 22 మందిని తక్షణమే వివిధ ఉద్యో గాలకు ఎంపిక చేసి, 37 మంది దరఖాస్తులను పరిశీలించవలసి ఉందని తెలిపారు.

నిర్మల్ నూతన ఏఎస్పీగా రాజేష్ మీనా

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యో తి) : నిర్మల్ జిల్లా నూతన ఏఎస్పీగా రాజేష్ మీనా నియమితులయ్యారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రాజేష్ మీనాను ప్రభుత్వం ఏఎస్పీగా నియమించారు.


ఏఎస్పీ మీనా

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎలాంటి వివరాలు చెప్పవద్దు ● డీఎస్పీ గంగారెడ్డి

పెంబి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పని చేయాలన్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటూ కొందరు మోసం చేసేందుకు ప్రయత్ని స్తున్నారని యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, సీవీ వీ నెంబర్లు, పాస్వర్డ్ ఎవరికి తెలియ జేయరాదన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే 100కి ఫోన్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, లైసెన్స్ తప్ప నిసరి ఉండాలన్నారు. యువత మద్యా నికి బానిస కావద్దని, పోలీసు సిబ్బంది ప్రజలతో స్నేహపూరితంగా ఉండాల న్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ సైదారావు, ఎస్‌హెచ్‌వో ఎం. హన్మాండ్లు, పోలీస్ సిబ్బంది భీమరాజు, ధనరాజ్, రాజులున్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

నర్సాపూర్(జి), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న గిర్దావర్‌ను డిప్యూటేషన్‌పై ఆర్‌డీవో కార్యాలయం నిర్మల్ నందు నియమించడంతో ఆ పరిధిలోకి వచ్చే మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో రైతులు ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్‌టీఐ సామాజిక కార్యకర్తల ప్రతి నిధి ముష్కం సుదర్శన్ గౌడ్ ప్రజా ఫిర్యా దుల విభాగంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించా రు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా చర్యలు తీసుకుంటున్నా నర్సా పూర్(జీ) మండలంలో మాత్రం విధు లు నిర్వహిస్తున్న అధికారిని డిప్యూటేషన్‌పై నిర్మల్ తరలించడం సమం జసం కాదని తెలిపారు. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి గిర్దావర్ 2ను మండల రెవెన్యూ కార్యాలయంలో నియమించి రైతులకు, ప్రజలకు ఇబ్బం ది కలగకుండా చూడాలని దరఖా స్తులో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే రైతులకు మూత్రశాలలు లేకపో వడం, రిజిస్ట్రేషన్ కార్యాలయం నూత న భవనం అర్ధాంతరంగా నిలిచిపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, వారసత్వ పట్టా మార్పిడిలకు కుటుం బ సభ్యుల ఆధార్ కార్డులు ధరణిలో తప్పుగా నమోదు చేయడంతో పాస్ బుక్‌లు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.


దరఖాస్తు అందజేస్తున్న ముష్కం సుదర్శన్ గౌడ్

ధాన్యం చోరీకి యత్నించిన వ్యక్తుల అరెస్ట్

లక్ష్మణచాంద, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం దొంగిలించబోయిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సుమలత సోమవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... సుంచు వినయ్, దేశవోయిన సుకుమార్, శివరాత్రి భూమేష్ అనే వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపారు. చింతల్‌చందా గ్రామానికి చెందిన రైతు నక్కల అన్వేష్ వరి ధాన్యం వినాయక్ టెంపుల్ దగ్గర రోడ్డుపై వడ్ల బస్తాలలో నింపి పెట్టారు. ఈ వడ్ల సంచులను ఎవరు లేని సమయంలో ఈ ముగ్గురు వ్యక్తులు దొంగతనం చేయడానికి ప్రయత్నించగా వారిని చూసి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నక్కల అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చింతల్‌పేట్‌ను గ్రామ పంచాయతీ చేయండి

పెంబి / (ఖానాపూర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలోని చింతల్‌పేట్ గ్రామా న్ని నూతన గ్రామ పంచా యతీగా ఏర్పాటు చేయాలని సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, గ్రామస్తులు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఖానాపూర్ ఎంపీవో రత్నాకర్ రావు, సెక్రటరీ ఉన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

జిల్లా జడ్జిని కలిసిన ఏజీపీ


జిల్లా జడ్జికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఏజీపీ

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :నిర్మల్ జిల్లా కోర్టు న్యాయాధికారి ఏ.కర్ణకుమార్‌ను ఖానాపూర్ కోర్టు ఏజీపీగా నియమితులైన అసిఫ్ అలీ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఆర్.అజయ్‌కుమార్‌కు పుష్పగుచ్చం అందజేశారు.

సమగ్రశిక్షా ఉద్యోగులకు ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు


హోమం చేస్తూ ఉద్యోగుల నిరసన

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 21వ రోజు సోమవారం సమస్యలపై సమగ్రశిక్ష ఉద్యోగులు రిలే దీక్ష కొనసాగుతోంది. సమగ్రశిక్ష ఉద్యోగులకు అండగా ఉంటామని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ హామీ ఇచ్చారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... డీఎస్పీ ఉద్యోగాన్ని వదులుకొని మార్పుకోసం ప్రజాసేవలో ఉండేందుకు ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నానని అన్నారు. విద్యావ్యవస్థకు మూలమైన సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు వెన్నంటే ఉంటానని హామీ ఇచ్చారు. విజయసంకల్ప హోమాన్ని నిర్వహించారు. ఉద్యోగ సంఘ నాయ కులు గంగాధర్, నరేష్, గజేందర్, స్వప్న, నారాయణ, సాగర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కల్లూరు కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో

కుంటాల, డిసెంబరు, 30 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రామరావు అన్నారు. సోమవారం మండలంలోని కస్తుర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగదితో పాటు పరిసరాలను, కిచెన్‌లో కూరగాయలు, తదితర వాటిని పరిశీ లించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కావున విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈయన వెంట ఎంఈవో ముత్యం, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి) : మండలంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో సమావేశమై వచ్చే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో కిషన్ రావు, తదితరులున్నారు.

ఆలయ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న డాక్టర్ రమేష్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గండి రామన్న దత్తసాయి ఆలయ నూతన ఛైర్మన్‌గా నియమితులైన భూరాజ్, ధర్మకర్త సురేష్‌ను సోమవారం తిరుమల నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ రమేష్ రెడ్డి శాలువాతో సన్మానించారు. డాక్టర్ వేణుగోపాల కృష్ణ, యోగేష్, శివ కుమార్, శ్రీనివాస్, అజయ్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో శృతిమించితే చర్యలు

● భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, డిసెంబరు 30: నూతన సంవత్సర వేడుకలను సంతోషకరమైన వాతవరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, వేడుకల నిర్వాహణలో భాగంగా శృతిమించి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఉంటే చర్యలు తప్పవని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. సోమవారం భైంసాలో పట్టణ పోలీసు సిబ్బందితో నూతన సంవత్సర వేడుకల్లో చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 31 రాత్రి వేళలో నిర్వహించే నూతన సంవత్సర స్వాగత వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోపే మద్యం దుకాణాలు,దాబాలు, హోటళ్లు, బార్లు మూసి వేయిస్తామన్నారు. ప్రధాన కూడళ్లలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ర్యాలీలు, బాణసంచా పేలుళ్లకు ,డీజేలకు అనుమతి లేదన్నారు. ఇందుకు విరుద్ధంగా వినియోగిస్తే డీజేలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడవద్దని ప్రజలకు సూచించారు. మైనర్లకు తల్లితండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఇలాంటి వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు.సైలెన్సర్లు తొలగించి శబ్ద కాలుష్యాన్ని సృష్టించినా ,ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో ప్రైవేట్ ఆస్తులకు నష్టం చేకూర్చినా సహించబోమన్నారు. రోడ్డుమార్గాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కేసులు నమోదు చేస్తామన్నారు.


మాట్లాడుతున్న భైంసా ఏఎస్పీ అవినాష్

పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ముథోల్ : పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సంజీవ్‌కుమార్ అన్నారు. డిసెంబరు 31 సెలబ్రేషన్స్, నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. తాగి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి వాహనాలు సీజ్‌చేస్తామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘించరాదని, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.